
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
2-4-2026 (Thursday)
MAIN EDITION

## దోమల బెడదపై ఎమ్మెల్యే వినూత్న నిరసన




**అక్షరటుడే, హైదరాబా సిటీ:** హైదరాబాద్‌లో పెరుగుతున్న దోమల బెడదపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. దోమల వలతో తయారు చేసిన దుస్తులను ధరించి మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్దకు దోమ తెరను, ఫాగింగ్ మిషన్‌ను సుధీర్ రెడ్డి తీసుకొని వెళ్తుండగా సిబ్బంది అడ్డుకున్నారు. అసెంబ్లీ సెక్యూరిటీ సిబ్బంది తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. నగరంలో నోరు తెరిచిన వెంటనే దోమలు నోట్లోకి వెళ్తున్నాయని పేర్కొన్నారు.

## త్వరలో ఇరాన్‌పై భీకర దాడులు: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌తో మొదలైన సంఘర్షణ తర్వాత తొలిసారి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా దళాలు టెహ్రాన్ సైనిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బ తీశాయని వెల్లడించారు. త్వరలోనే లక్ష్యాలను సాధించి 'పని పూర్తి' చేయబోతున్నామని పేర్కొన్నారు. తమ ముఖ్య ఉద్దేశాలు దాదాపు పూర్తవుతున్నాయని వెల్లడించారు. ఇరాన్ కీలక నాయకత్వంతో పాటు, ఆ దేశ నాకౌదళం, ఎయిర్ ఫోర్స్‌ను నాశనం చేశామని ట్రంప్ తెలిపారు.

## పాకిస్తాన్‌కు రాజ్‌నాథ్‌సింగ్ వార్నింగ్




అక్షరటుడే, నేషనల్‌డెస్క్: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ యుద్ధాన్ని అడ్వాంటేజ్‌గా తీసుకుని కవ్వించాలని చూస్తే అంతకు రెట్టింపు సమాధానం చెబుతామని హెచ్చరించారు. కేరళలోని సైనిక్ సమ్మేళన్‌లో ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు.

## చంద్రబాబును ప్రశంసించిన ఆప్ ఎంపీ



అక్షరటుడే, ఢిల్లీ: రాజ్యసభలో అమరావతికి చట్టబద్ధత బిల్లుపై చర్చలో భాగంగా ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు విజనరీ లీడర్ అని ప్రశంసించిన సంజయ్ సింగ్.. ఇప్పుడు అధికారం చంద్రబాబు చేతుల్లోనే ఉందని కేంద్రం నుంచి ఎంత రాబట్టుకుంటారో రాబట్టుకోవాలన్నారు.

## అందుకే జగన్ వింత ప్రతిపాదన



అక్షరటుడే, అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కూటమి నేతలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అమరావతి పేరు పలకడానికే జగన్ ఇష్టపడరని వ్యాఖ్యానించారు. అందుకే మావిగన్ అని వింత పేరును తీసుకొచ్చారన్నారు. రాజధానిపై జగన్ వైఖరి భవిష్యత్తులోనూ మారదని నిన్నటితో మరోసారి స్పష్టమైంది" అని చంద్రబాబు అన్నారు.

## ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్: సీఎం విజయన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేరళం అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో అధికార ఎల్‌డీఎఫ్ కూటమి తాజాగా మేనిఫెస్టో విడుదల చేసింది. తాము మళ్లీ అధికారంలోకి వస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పిస్తామని సీఎం పినరయి విజయన్ ప్రకటించారు. కేరళ ముఖ్యమంత్రి, ధర్మడం నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థి అయిన పినరయి విజయన్ గురువారం మేనిఫెస్టోను విడుదల చేశారు. తాము గెలిస్తే పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచుతామన్నారు. పేదరిక నిర్మూలనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, ఆరోగ్య రంగాల్లో గణనీయమైన మార్పులు తీసుకువస్తామన్నారు.

## రవివర్మ పెయింటింగ్‌కు రూ.167 కోట్లు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రముఖ భారతీయ చిత్రకారుడు రాజా రవివర్మ గీసిన ఓ పెయింటింగ్ అరుదైన రికార్డు సృష్టించింది. ముంబయిలో సాఫ్రాన్ ఆర్ట్స్ స్ప్రింగ్ లైవ్ ఆక్షన్ నిర్వహించారు. ఇందులో యశోద, చిన్ని కృష్ణుడు ఉన్న ఆయిల్ పెయింటింగ్ రూ.167.2 కోట్లకు అమ్ముడయ్యింది. ప్రముఖ పారిశ్రామిక వేత్త, సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు సైరస్ పూనావాలా దక్కించుకున్నారు. ఈ చిత్రాన్ని 1890లలో గీశారు.



# థియేటర్లలో రెంటల్ సిస్టం రద్దు

రాష్ట్రంలోని ఎగ్జిబిటర్లు సంచలన నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఉన్న రెంటల్ సిస్టంను రద్దు చేశారు. దానికి బదులుగా వసూళ్లలో పర్సంటేజీ ఇచ్చే విధానాన్ని అమలు చేయనున్నారు. ఏళ్లుగా తెలుగు సినీ పరిశ్రమలో నెలకొన్న వివాదం తాజా నిర్ణయంతో పరిష్కారమైంది. ఈ మేరకు 23 ప్రధాన థియేటర్ల యాజమాన్యాలు కొత్త విధానానికి అంగీకారం తెలిపాయి.

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ ఎగ్జిబిటర్ల సంచలన నిర్ణయం ■ పర్సంటేజీ సిస్టమ్ అమలుకు మొగ్గు

సినీ రంగంలో డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల పాత్ర ఎంతో కీలకం. అయితే వీరి మధ్య కొన్నేళ్లుగా వివాదం నడుస్తోంది. గతంలో డిస్ట్రిబ్యూటర్లు థియేటర్‌లో సినిమా రిలీజ్ చేసినందుకు రెంట్ చెల్లించేవారు. వసూళ్లతో సంబంధం లేకుండా.. టాకీస్‌లా ఓనర్లకు అద్దె కింద డబ్బులు ఇచ్చేవారు. అయితే ఈ విధానంతో తాము నష్టపోతున్నామని డిస్ట్రిబ్యూటర్లు చాలా రోజులుగా నిరసన తెలుపుతున్నారు. సినిమా ఫ్లాప్ అయినా.. పెద్ద మొత్తంలో అద్దెలు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తాజాగా ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు చర్చించుకొని సమస్యను పరిష్కరించుకున్నారు.

### రేపటి నుంచి అమలు

టాలీవుడ్ ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య 'రెంటల్' వివాదానికి తెరపడింది. థియేటర్ల యాజమాన్యాలు చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకున్నాయి. ఇకపై థియేటర్లకు నిర్ణీత అద్దె చెల్లించే రెంటల్ సిస్టమ్ స్థానంలో వసూళ్లలో వాటాను పంచుకునే 'పర్సంటేజీ సిస్టమ్' తీసుకొచ్చారు. కొత్త విధానానికి తెలంగాణలోని 23 ప్రధాన థియేటర్ల యాజమాన్యాలు అంగీకారం తెలిపాయి. కొత్త నిబంధనలు ఏప్రిల్ 3 నుంచి అమలులోకి రానుంది. దీంతో టాలీవుడ్‌లో పంపిణీదారులకు ఆర్థిక ఇబ్బందులు తప్పనున్నాయి.

### ఇద్దరికీ నష్టం లేకుండా..

గతంలో ఉన్న రెంటల్ విధానంతో థియేటర్ యజమానులకు డబ్బులు బాగానే వచ్చేవి. అయితే సినిమా హిట్ అయితే డిస్ట్రిబ్యూటర్లకు కూడా డబ్బులు మిగిలేవి. కానీ ఫ్లాఫ్ అయినప్పుడు కూడా అంతే మొత్తంలో అద్దె చెల్లించాల్సి రావడంతో డిస్ట్రిబ్యూటర్లు తీవ్రంగా నష్టపోయేవారు. భారీగా అద్దెలు చెల్లించలేక తిప్పలు పడేవారు. కొత్త విధానంతో థియేటర్ వసూళ్లలో కొంత శాతం యాజమాన్యానికి, మిగిలినది డిస్ట్రిబ్యూటర్‌కు వెళ్తుంది. సినిమా బాగా ఆడితే ఇద్దరికీ లాభాలు వస్తాయి. ఒకవేళ ఆడకపోతే ఇద్దరూ నష్టపోతారు.

## చేనేత కార్మికుల పొట్ట కొడుతున్న ప్రభుత్వం : కవిత



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం చేనేత కార్మికుల జీవితాలను మరింత సంక్షోభంలోకి నెట్టేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026-27 విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థుల యూనిఫాం తయారీకి గతంలో టెస్కోకు అధికారులు ఆర్డర్ ఇచ్చారు. రూ.105.54 కోట్ల ఆర్డర్‌ను తాజాగా రద్దు చేశారు. దీంతో నేత కార్మికుల ఉపాధిపై ప్రభావం పడనుంది. ప్రభుత్వ నిర్ణయంపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించి ఇచ్చే ఆర్డర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తున్న విద్యాశాఖ ఏకపక్షంగా రద్దు చేసిందని కవిత విమర్శించారు. రూ.105 కోట్ల విలువైన టెండర్ రద్దు కావడంతో 393 చేనేత సహకార సంఘాల్లోని వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ శాఖలు, ఇతర డిపార్ట్మెంట్లు సైతం రూ.200 కోట్ల విలువైన దుప్పట్లు, ఇతర దుస్తుల పంపిణీకి గడువు ముగిసినా టెస్కోకు ఆర్డర్ ఇవ్వలేదని ఆమె పేర్కొన్నారు. ఏదో ఒక సంస్థకు మేలు చేయడానికి చేనేత కార్మిక కుటుంబాల పొట్టకొట్టే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు.


## ఎన్‌జీటీలో ప్రభుత్వానికి ఊరట





**అక్షరటుడే, హైదరాబాద్:** మూసీ ప్రక్షాళన విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో ఊరట లభించింది. మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్ ఎన్‌జీటీ కొట్టివేసింది. రాష్ట్ర ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్, గాంధీ సరోవర్ ప్రాజెక్ట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. ఎన్ని అడ్డంకులు వచ్చినా మూసీ సుందరీకరణ చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో పలుమార్లు ప్రకటించారు. అయితే మూసీ ప్రాజెక్ట్‌తో ఎంతో మంది ఇళ్లు కోల్పోతున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ప్రాజెక్ట్‌ను సవాల్ చేస్తూ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డి ఎన్‌జీటీని ఆశ్రయించారు. మూసీ సుందరీకరణ, గాంధీ సరోవర్ ప్రాజెక్టులతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని పిటిషన్ వేశారు. విచారణ చేపట్టిన ట్రిబ్యూనల్ ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## ఢిల్లీలో భారీగా సీసీ కెమెరాల తొలగింపు

**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో అమర్చిన లక్షకు పైగా సీసీ కెమెరాలను తొలగించనుంది. జాతీయ భద్రతకు ముప్పు పొంచి ఉందని వీటిని తీసి వేస్తున్నట్లు తెలిపింది. ఆమ్ ఆద్మీ పార్టీ హయాంలో నగరవ్యాప్తంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చైనాలో తయారైన 1.4 లక్షల సీసీ కెమెరాలను అమర్చారు. వీటిని దశలవారీగా తొలగించే ప్రక్రియను ఢిల్లీ ప్రజా పనుల శాఖ మంత్రి పర్వేష్ సాహిబ్ సింగ్ బుధవారం ప్రారంభించారు. ఢిల్లీలో రెండు దశల్లో మొత్తం 2,74,389 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మంత్రి పర్వేష్ సాహిబ్ సింగ్ మాట్లాడుతూ.. ఢిల్లీ అంతటా చైనాకు చెందిన హిక్‌విజన్ కెమెరాలను ఏర్పాటు చేసేటప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ దీర్ఘకాలిక భద్రతా పరిణామాలను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. నిఘా అనేది కేవలం ప్రదర్శన కోసం పెట్టే విషయం కాదని, ఇది సున్నితమైన డేటా నియంత్రణకు సంబంధించిన సమస్య అన్నారు. ఈ నేపథ్యంలో కెమెరాలను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.




## మా మధ్య మంచి కెమిస్ట్రీ కుదిరింది..



'ఎవడే సుబ్రమణ్యం' మూవీతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైంది మాళవిక నాయర్. ఈ అమ్మడు 'కళ్యాణ వైభోగమే', 'మహానటి', 'టాక్సీవాలా', ''అన్నీ మంచి శకునములే' వంటి చాలా చిత్రాలతో నటించింది. కానీ టాలీవుడ్‌లో ఆమెకు అనుకున్నంత క్రేజ్ రాలేదు. 'కల్కి 2898 ఏడీ'లో స్పెషల్ రోల్‌లో కనిపించిన ఈ బ్యూటీ.. ఇప్పుడు 'బైకర్' మూవీతో మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్స్‌లో భాగంగా విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తికర విషయాలు తెలిపింది. ''నాకు ప్రతి సారి కొత్త క్యారెక్టర్ చేయాలని ఉంటుంది. అలాంటి పాత్రలు వస్తే కచ్చితంగా చేస్తాను. ఇప్పటివరకు నా జర్నీ పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను. ఇంకా మంచి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను. శర్వానంద్ నేనూ రియల్ లైఫ్‌లో కూడా ఇంట్రోవర్ట్స్. పెద్దగా మాట్లాడుకోము. కానీ సినిమాలో క్యారెక్టర్ల పరంగా మంచి కెమిస్ట్రీ కుదిరింది'' అని చెప్పుకొచ్చింది.

—అక్షరటుడే, సినిమాడెస్క్

## ఎరువుల దిగుమతులపై సుంకాలు రద్దు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎరువుల కంపెనీలకు ఉపశమనం కలిగించేలా.. అమ్మోనియం నైట్రేట్‌పై దిగుమతి సుంకాన్ని రద్దు చేసింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధంతో ఎరువుల సరఫరాలో అంతరాయం నెలకొన్న విషయం తెలిసిందే. దీంతో అమ్మోనియం నైట్రెట్‌తో పాటు పెట్రోకెమికల్ ఉత్పత్తులపై కూడా దిగుమతి సుంకాన్ని ఎత్తివేసింది. ఈ నిర్ణయం నేటి నుంచి జూన్ 30వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయంతో ఎరువులు రసాయన పరిశ్రమలకు ఊరట లభించనుంది. యుద్ధాలు, సరఫరా కొరత కారణంగా వ్యయ ఒత్తిళ్లు పెరుగుతున్న తరుణంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది.

## 'ఐప్యాక్' కార్యాలయాల్లో ఈడీ సోదాలు..




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్నికల జరుగున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ రాజకీయ వ్యూహకర్త సంస్థ 'ఐప్యాక్' చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో ఈడీ అధికారులు సంస్థ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా గల ఐప్యాక్ కార్యాలయాలతో పాటు ఆ సంస్థ వ్యవస్థాపకుల నివాసాల్లో సోదాలు చేశారు. హైదరాబాద్, ముంబై, బెంగళూరు నగరాల్లోని గల ఆఫీస్లు ఈడీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఐప్యాక్ ఆర్థిక లావాదేవీలపై కొంతకాలంగా నిఘా పెట్టిన ఈడీ అధికారులు, మనీలాండరింగ్ జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. రాజకీయ వ్యూహాల కోసం వివిధ పార్టీల అందిన నిధుల మళ్లింపుపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కాగా.. వివిధ పార్టీలకు ఎన్నికల వ్యూహాలను అందించే ఐప్యాక్‌పై ఈడీ దాడులు జరగడం ప్రస్తుతం దేశంలోని రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు తెరతీసింది.